క్లుప్తంగా

సెల్ స్టిక్కర్ల ఆవిష్కరణ


స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి హనిమిరెడ్డి

అద్దంకి: వెంపరాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోను బృందం తయారు చేయించిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి మంగళవారం రాత్రి ఆవిష్కరించారు. ఈ స్టిక్కర్‌లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఇన్‌చార్జి హనిమిరెడ్డి చిత్రాలు కలిసి ఉన్నాయి. స్టిక్కర్లను సెల్‌ఫోన్ వెనుకవైపున అంటించుకునేందుకు వీలుగా తయారు చేయించినందుకు వారిని ఇన్‌చార్జి అభినందించారు. సమావేశంలో వివిధ హోదాల్లో ఉన్న స్థానిక నాయకులు, మండలంలోనినాయకులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ


దుస్తులు పంపిణీ చేసిన రోటరీ క్లబ్ సభ్యులు

మేదరమెట్ల: రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ, అద్దంకి ఆధ్వర్యంలో కొరిశపాడు మండలంలోని రావినూతల గ్రామంలో దత్త జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా తమ్మన హనుమంతరావు మనుమరాలు జేత శ్రీదత్త పుట్టిన రోజు వేడుకలను కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది పేదలకు బట్టలు పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అయోధ్య నుంచి వచ్చిన అక్షతలు పంపిణీ


అక్షతలకు స్పర్శపూజ చేస్తున్న అర్చకులు

చీరాల: అయోధ్య నుంచి చీరాలకు చేరిన అక్షతలను ప్రత్యేక పూజల అనంతరం పేరాల్లోని ప్రతి ఇంటికి పంపిణీ చేశారు. చీరాల విశ్వహిందు పరిషత్, శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను పేరాల కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో స్పర్శ పూజ చేసి కమిటీ ప్రతినిధులు ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు భక్తిభావంతో మెలగాలని శ్రీరాములు వారి ఆశీర్వాదాలు అందరికి కలగాలనే సంకల్పంతో అక్షతలను ఇంటింటికి పంపిణీ చేస్తున్నామని పరిషత్ ప్రతినిధులు తెలిపారు.

నేడు మాస పౌర్ణమి

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు భీమలింగేశ్వరస్వామి వారి దేవస్థానంలో నేడు మాస పౌర్ణమి సందర్భంగా పూజా కార్యక్రమాలు జరగనున్నట్లు ఆలయ పురోహితులు మంగళవారం తెలిపారు. బుధవారం తెల్లవారు జాము 3 గంటలు నుంచి స్వామి వారికి పంచామృత, విశేష ద్రవ్యాలతో అభిషేక కార్యక్రమం, అన్నాభిషేకం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరై స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

శింగరకొండ దర్శిని


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయనం మర్గశిర మాసం, మృగశిర నక్షత్రం పౌర్ణమి తిథి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర మంగళవారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

యువకుడు అదృశ్యంపై కేసు


తిరువీధుల ప్రసాద్

చీరాల: యువకుడు అదృశ్యంపై ఈపూరుపాలెం రూరల్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్సై జనార్దన్ వివరాల మేరకు.. ఈపూరుపాలెం గ్రామానికి చెందిన తిరువీధుల ప్రసాద్ గ్రామంలోని ఓ హ్యాండ్లూమ్స్‌లో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఇటీవల అతడు అనారోగ్యానికి గురయ్యాడు. అయితే ఈనెల 24న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు అన్ని ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో మంగళవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అందిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసును నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆడుదాం ఆంధ్రాతో క్రీడాకారుల గుర్తింపు

- వేడుకగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం
- క్రీడాకారుల నుంచి భారీ స్పందన
- ప్రారంభించిన ప్రజా ప్రతినిధులు, అధికారులు


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి హనిమిరెడ్డి


పూనూరులో క్రీడా ప్రతిజ్ఞ చేస్తున్న తహశీల్దారు, క్రీడాకారులు


మార్టూరులో వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ఆమంచి

చీరాల/చీరాల టౌన్/వేటపాలెం: 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంతో క్రీడాకారులు వెలుగులోకి వస్తారని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం పేరాల ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్లో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడారంగంలో ఏపీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా ఏర్పాటు చేశారన్నారు. చీరాల ప్రాంతంలోనే అధికంగా క్రీడాకారులను తయారు చేసిన శిక్షకులు, మైదానాలు, సామగ్రి అందుబాటులో ఉందన్నారు. చైతన్యానికి మారుపేరైన చీరాల క్రీడాకారులకు నెలవని, ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత ఉంటుందన్నారు. కార్యక్రమంలో మొదటగా క్రికెట్, వాలీబాల్, టెన్నిస్, ఖోఖో ఇతర క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ప్రభుత్వం అందించిన పోటీల క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో వైస్ చైర్మన్లు జైసన్‌బాబు, రామసుబ్బులు, మున్సిపల్ కౌన్సిలర్లు సూరగాని లక్ష్మీ, యానాదిరావు, ఎం.లలిత, యువజన విభాగం కార్యదర్శి యాతం మధుకర్, పార్టీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, శ్రీను, హైస్కూళ్ల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, పీఈటీలు తదితరులు ఉన్నారు.

☛ చీరాల పురపాలక సంఘ పరిధిలోని 25 సచివాలయలకు సంబంధించి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఎస్‌ఆర్ పీఏమ్ హైస్కూల్, ఎఆర్‌ఎం హైస్కూల్, సెంట్ ఆన్స్ స్కూల్, చీరాలలో ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.సరోజిని, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డిలు క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. 2వ వైస్ చైర్‌పర్సన్ శిఖాకొల్లి రామసుబ్బులు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

☛ గ్రామీణ ప్రాంతాల్లో నుంచి మెరికల్లాంటి క్రీడాకారులను వెలికితీసి వారికి ఉత్తమ శిక్షణ అందించి భావి క్రీడాకారులుగా ఖ్యాతి గడించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. మండలంలోని ఈపురుపాలెం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడా సంబరాలను తహశీల్దార్ ప్రారంభించి మాట్లాడారు. క్రీడా సంబరాలను 45 రోజుల పాటు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించారన్నారు. మండలంలోని అన్నీ సచివాలయాల పరిధిలోని 15 ఏళ్ల పైబడిన బాలబాలికలు 6919 రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను తహశీల్దార్‌తో పాటుగా జెడ్పీటీసీ ఎ.పద్మినిలు పరిచయం చేసుకుని ఆల్ ది బెస్ట్ చెప్పారు. కార్యక్రమాల్లో ఆయా పంచాయతీల సెక్రటరీలు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

☛ ప్రభుత్వం పాఠశాలల్లో విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత కల్పిస్తోందని వేటపాలెం మండల ప్రత్యేక అధికారి జె రాజా డెబోరా పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తపేటలో బ్యాడ్మింటన్ పోటీలను ఎంపీడీఓ నేతాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నేతాజీ మాట్లాడుతూ క్రీడలు మానసిక ప్రశాంతతకు దోహదపడుతుందని తెలిపారు. అక్కాయిపాలెం పంచాయతీ పరిధిలోని గ్రామ ప్రతేక అధికారి ఐ కాశీవిశ్వనాథ్ పోటీలను ప్రారంభించారు.

ఆడుదాం ఆంధ్రాతో యువతకు మేలు..

కారంచేడు/చినగంజాం/మార్టూరు/యద్దనపూడి: రాష్ట్ర ప్రభుత్వం యువత కోసం 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జిల్లా సహకార శాఖాధికారి, మండల ప్రత్యేక అధికారి కేవీ రామారావు అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రం కారంచేడు రామానాయుడు స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు యువత మంచి ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుందన్నారు. మహిళలకు ప్రాధాన్యత నిస్తూ, యువతీ, యువకులకు ఇది గొప్ప అవకాశంగా ఉంటుందన్నారు. మండలంలోని యర్రంవారిపాలెం, స్వర్ణ, కొడవలివారిపాలెం, కుంకలమర్రు, దగ్గుబాడు గ్రామాల్లో పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, ఎంపీడీవో పీ లక్ష్మీనారాయణ, ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

☛ చినగంజాం మండలంలోని కడవకుదురు సచివాలయం పరిధిలో సర్పంచ్ గొల్లమూరి శివకుమారి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ డిప్యూటీ సీఈఓ హనుమంతురావు, ఎంపీడీఓ కె.స్వరూపారాణి, ఈఓఆర్డీ వేణు, పంచాయతీ కార్యదర్శి సూర్యనారాయణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

☛ పర్చూరు మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్, తహశీల్దారు సంధ్యశ్రీ ఆటల పోటీలను ప్రారంభించారు. పర్చూరు, అడుసుమల్లి, ఇనగల్లు, గొల్లపూడి, గ్రామాలకు చెందిన క్రీడాకారులు పర్చూరు శారద హైస్కూల్ గ్రౌండ్‌లో తిమ్మరాజుపాలెం, ఏదుబాడు, అన్నంబొట్లవారిపాలెం, వీరన్నపాలెం, పోతుకట్ల గ్రామాలకు చెందిన క్రీడాకారులకు చెరుకూరు జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో క్రీడాపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటరామయ్య, చెరుకూరు సర్పంచ్ పేరం సుబ్బారావు, మండల ఉపాధ్యక్షులు పాలేరు వీరయ్య, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

☛ యద్దనపూడి మండల వ్యాప్తంగా క్రీడలకు 2432 మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. మండలంలో తొమ్మిది సచివాలయాల పరిధిలో పూనూరు, యద్దనపూడి, జాగర్లమూడి గ్రామాల్లో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, పోటీలు నిర్వహించారు. తొలుత జాతీయ జెండాలతో నాయకులు, అధికారులు, క్రీడాకారులు ర్యాలీ నిర్వహించారు. పోటీల్లో తహశీల్దారు రవికుమార్, ఎంపీడీఓ కృష్ణకుమారి, ఈఓఆర్డీ శ్రీనివాసరావు, బాపట్ల పార్లమెంటరీ జిల్లా కార్యదర్శి తమ్మా అమ్మిరెడ్డి, సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శారీరకంగా దృఢత్వంతోనే మానసికానందం..

అద్దంకి/అద్దంకి రూరల్/బల్లికురవ/మేదరమెట్ల/జే.పంగులూరు: శారీరకంగా దృఢంగా ఉంటేనే మానసికంగా దృఢంగా ఉంటారని జెడ్పీటీసీ సభ్యురాలు రాయిణి ప్రమీల, సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం అన్నారు. మండల పరిధిలోని 14 సచివాలయంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం మాగుంట సుబ్బారెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిణి వెంకటసుబ్బారావు, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి, నాయకులు రామారావు, ఆంజనేయులు, దేవేంద్ర, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

☛ ఆటలు ఆడటం వలన ఆరోగ్యం, వ్యాయామం కలుగుతుందని ప్రతి ఒక్కరూ ఆటలు ఆడి రాణించాలని మేదరమెట్ల మండల ప్రత్యేకాధికారి ఉమ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల సెయింట్ ఆర్నాల్డ్స్ స్కూల్‌లో ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, తహశీల్దార్ సుశీల, జెడ్పీటీసీ సభ్యురాలు టీ.వెంకటరమణ, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ వై.రత్నారెడ్డి, సర్పంచ్ బొనిగల ఎలీశమ్మ, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

☛ యువతీ, యువకులు రాణించాలన్న సంకల్పంతోనే సీఎం జగన్ ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రవేశ పెట్టారని ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ అన్నారు. బల్లికురవలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. మండలంలోని 20 సచివాలయాల్లో జనవరి 9 వతేదివరకు జరిగే క్రీడా పోటీల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న 617 టీమ్‌లు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బాలసుబ్రమణ్యం, ఎంపీడీవో బ్రహ్మయ్య, తహశీల్దార్ కె. రవిబాబు, ఎంఈఓ 2 కె. రమేష్‌బాబు, వైద్యాధికారి జీ. రవితేజ, పార్టీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లి అంజనీ ప్రసాదరెడ్డి, వల్లాపల్లి సొసైటీ అధ్యక్షుడు మంచాల శ్రీనివాసరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్థానిక నేతలు పాల్గొన్నారు.


ఈపురుపాలెంలో పోటీలను ప్రారంభిస్తున్న తహశీల్దార్ ప్రభాకరరావు


పేరాల క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న చైర్మన్, పీఈటీలు, కౌన్సిలర్లు


కొత్తపేటలో బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీడీఓ నేతాజీ


కారంచేడులో జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ సుబ్బారావు


పర్చూరులో బెలూన్‌లు ఎగురవేస్తున్న అధికారులు


కడవకుదురులో మాట్లాడుతున్న సర్పంచ్ శివకుమారి


బల్లికురవలో ప్రతిజ్ఞ చేస్తున్న క్రీడాకారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు


మేదరమెట్లలో క్రీడా సామగ్రి అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


జే.పంగులూరులో క్రీడా పరికరాలు అందజేస్తున్న జెడ్పీటీసీ ప్రమీల


పంగులూరులో కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

వంగవీటి మోహనరంగాకు నివాళులు


రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆమంచి


వంగవీటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హనిమిరెడ్డి

పర్చూరు (చినగంజాం): కాపు ఉద్యమ నేత వంగవీటి మోహన్‌రంగ వర్ధంతిని పర్చూరులో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ బొమ్మలసెంటర్‌లో ఉన్న రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రంగా అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు గాదె సురేష్, ఆకుల హేమంత్, లంకా శివ, కోటా శ్రీనివాసరావు, గోగుల శ్రీనివాసరావు, షేక్ ఖాలేషా, తులసి నాగమణి, అప్పారావు, ప్రసాద్, చెరుకూరి వెంకటస్వామి, మల్లంపాటి చెంచుబాబు, కంకటం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి మోహన రంగాకు ఘన నివాళి..

అద్దంకి రూరల్: వంగవీటి మోహన రంగా వర్ధంతి సందర్భంగా స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కాకాని రాధకృష్ణమూర్తి, కౌన్సిలర్‌లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రంగా సేవలు అమోఘం

చీరాల: పీడిత, అట్టడుగు వర్గాల అభివృద్ధికి వంగవీటి మోహన్‌రంగా చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. వంగవీటి మోహనరంగా వర్ధంతి వేడుకలను మంగళవారం రాధారంగా మిత్రమండలి కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వంగవీటి మోహనరంగా చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వంగవీటి మోహనరంగా జీవితం పోరాటాలకు, అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతికి, పీడిత జాతుల పక్షాన గొంతుకలా పనిచేసి చరిత్రలో నిలిచారన్నారు. కార్యక్రమాల్లో పలు పార్టీల నాయకులు సీహెచ్.వాసు, జి.శివరాంప్రసాద్, చంద్రశేఖర్, కస్తూరి, కిరణ్, నాగలక్ష్మీ, ఉన్నారు.

కారంచేడులో 35వ నేత్రదానం


హైమావతి (ఫైల్)

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు యజ్ఞశాలపేటలో 35వ నేత్ర దానం నిర్వహించారు. మంగళవారం గ్రామానికి చెందిన యార్లగడ్డ కోటయ్య సతీమణి యార్లగడ్డ హైమావతి (80) మంగళవారం వేకువజామున మృతి చెందింది. ఆమె కోరిక తన మరణం తరువాత తన నేత్రాలు దానం చెయ్యాలని. ఆమె కోరిక మేరకు కుమారుడు యార్లగడ్డ ఆంజనేయులు, నాగమణి దంపతులు తల్లి రుణం తీర్చుకోవడానికి తల్లి రెటీనాను దానం చేయాలని ఆలోచించారు. విషయాన్ని గ్రామంలోని ఐ అండ్ బ్లడ్ డొనేషన్ సభ్యులకు సమాచాం అందించారు. వారి సహకారంతో గుంటూరు జిల్లా పెదకాకాని శంకర్ నేత్రాలయం వైద్యులు డాక్టర్ నితిన్ ఆధ్వర్యంలోని బృందం కారంచేడు వచ్చి ఆమె నేత్రాలను స్వీకరించారు. సభ్యులు యార్లగడ్డ వెంకన్న, ఆంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా దత్త జయంతి వేడుకలు


వేటపాలెంలో ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయ స్వామి మూలవిరాట్

వేటపాలెం: కొత్తపాలెం రోడ్డులోని దత్తక్షేత్రంలో దత్తజయంతి వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాలతో స్వామి వారికి అభిషేకాలు చేశారు. స్వామి వారికి సువర్ణ, రజిత ఆభరణాలతో అలకంరించారు. ఆలయ ప్రాంగణలో దత్తహోమం నిర్వహించారు. గురుచరితం, సాయి చరితం పుస్తకాలను భక్తులకు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరి స్వామి వారిని దర్శించుకొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నసంతర్పన గావించారు. కార్యక్రమంలో ఆలయ కన్వీనర్ కరణం ప్రమీలదేవి, అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు, కార్యదర్శి నున్నా శివప్రసాదరావు, కోశాధికారి కరణం మురళీ కృష్ణ పాల్గొన్నారు.

హనిమిరెడ్డి ప్రత్యేక పూజలు

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలోని ధన్వంతరీ దత్తపాదుకా క్షేత్రంలో మంగళవారం అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం దేవస్థాన అర్చకులు ఇన్‌చార్జిని సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బీవీ కృష్ణారెడ్డి, అవిశెన ప్రభాకరరెడ్డి, పాదయాత్ర రోశయ్య, మారం రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వలపర్లలో 'ఆడుదాం ఆంధ్రా'

మార్టూరు: మండలంలోని వలపర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో నేడు రెండో రోజు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పాల్గొననున్నట్లు పర్చూరు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. కార్యక్రమానికి మండలంలోని అధికారులు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ వేడుకలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

చీరాల అర్బన్: సీపీఐ 99వ ఆవిర్భావ వేడుకలను మంగళవారం చీరాలలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ రోడ్‌లోని సీపీఐ కార్యాలయం వద్ద నాయకులు జెండాను ఆవిష్కరించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ గత 98 సంవత్సరాలుగా కార్మిక, కర్షక, పేద వర్గాల సమస్యలపై సీపీఐ పార్టీ పోరాడుతూనే ఉందని గుర్తు చేశారు. స్వతంత్ర్య ఉద్యమంలో సీపీఐ ఒక మైలురాయిగా మిగిలిపోయిందన్నారు. నేడు ప్రభుత్వాలు ప్రజలకు చేస్తున్న అన్యాయాలు, అక్రమాలను పార్టీ ఎండకడుతూ ప్రజలకు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో శామ్యూల్, వెంకట్రావు, సుబ్బారావు, ప్రకాష్, సుభాని, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ నిర్మాణానికి విరాళం


ఆశ్రమ నిర్వాహకుడు చందుకు నగదు అందిస్తున్న దాత

మార్టూరు: మండల కేంద్రమైన మార్టూరులో నిర్మాణం జరుపుకుంటున్న అమ్మ అనాథ ఆశ్రమం కోసం స్థానిక దాతలు మంగళవారం రూ. 25 వేలు ఆర్థిక సాయం అందించారు. స్థానిక నాగరాజుపల్లి సెంటరుకు చెందిన ముప్వ వీర నారాయణ శారద దంపతులు ఆశ్రమ నిర్వాహకుడు గుంటుపల్లి చందుకు విరాళం అందించారు.

వెంకటేష్‌కు ఎమ్మెల్యే బాలినేని పరామర్శ


వెంకటేష్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

చీరాల: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌ను మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. అనంతరం చీరాల ఎమ్మెల్యే కరణంతో మాట్లాడారు.

రేపు మార్టూరులో పెన్షనర్స్ వేడుకలు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో ఈనెల 28వ తేదీ పెన్షనర్స్ డే వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో గురువారం ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్న కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు ఇతర పెన్షనర్లు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు